# అనసూయ లేచిపోయింది

"అనసూయ లేచి పోయిందిట"

"అవును అనసూయ లేచి పోయింది"

నలభయ్యోపడి వచ్చాక ఎవడు దొరికాట్టా!

"ముసలి కాలంలో ముచ్చట్లు అన్నట్టుగావుంది"

"ఆ ట్యూషన్ చెప్పే కుర్రాడితో పోయిందిట"

"ఏంకాలమో ఏమో నాలుగేళ్ళు చిన్నవాడే అమ్మా"

"అయ్యో! ఆయ్యో ఏంవిడ్డూరమే అమ్మా ఇన్నాళ్ళు పెళ్ళి కాకుండా ఆగి ఆ కులం తక్కువ వాడితో పోవాలా!"

"ఆ ముసలాళ్ళు ఇంక మంచంమించి లేవరే అమ్మా!"

అంటూ తమకు అందిన వార్త విని ఆడిపోస్తున్నారు. అమ్మ లక్కలంతా. అందులోనే మరోపక్షం వారు.

"ఎన్నాళ్ళు పడుంటుంది పెళ్ళి కాకుండా"

"అది మాత్రం ఆడది కాదుటే"

"ఆ తల్లితండ్రులు కూతురు సంపాదన మరిగారే"

"ఈ కాలంలో కన్న తల్లితండ్రుల ప్రేమలో కూడా స్వార్థమేనే తల్లీ!

"అయినా ఏ ఆడది మొగుడు పిల్లల్ని ఒద్దనుకుంటుందే"

"ఇన్నాళ్ళకేనా తెగించింది పాపం"

ఆ కుర్రాడెవడో కాని కన్నెచెర విడిపించాడు"

ఇలా రకరకాలుగా చర్చలు సాగిపోతున్నాయి. ఊరంతా అదే గొడవ. వింతగా చెప్పుకోడానికి జనానికి ఏదో కొత్త విషయం వుండాలి. అందరూ ఆక్షేపణలు- విమర్శనలు- సానుభూతులూ ఈర్ష్య-ద్వేషం-పగ-సెగ-రకరకాలు మనుష్యుల తత్త్వాలు, ఆయా తత్త్వాలను బట్టి కొత్త విషయాన్ని ఆ కోణంలో నుంచిచూసి చర్చించడం మెదలు పెడతారు. కొందరికి అదొక చెప్పలేని సంతృప్తి. తమ తప్పులు దాచుకోడానికి అదొక పన్నాగం కూడా నేమో! తమే తప్పు చేసినట్లు జనానికి తెలియదని వారి ధైర్యం.

రాత్రి ఏడుగంటలయ్యింది. ఇంట్లో ఎవ్వరూలేరు. అనసూయ మాత్రం హాల్లో పడక కుర్చీలో కూర్చుంది. మరునాడు క్లాసులో చెప్పబోయె విషయం కోసం పుస్తకం తిరగేస్తోంది. మనస్సు మాత్రం దానిమీద లేదు. చేతులు మాత్రం పుస్తకం మీదే వున్నాయి.

చల్లని వాతావరణం ఎంతో ప్రశాంతంగావుంది. గాలికిటికీ నుంచి ఎగిరెగిరి మీదపడి గిలిగింతలు పెడుతోంది. పక్కనున్న నైటుక్వీను సువాసన గాలితో పాటు గుపున వచ్చి మనస్సును వుక్కిరి బిక్కిరి చేస్తోంది. వక్కనే రేడియోలో తూర్పూపడమర చిత్రంలోని శివరంజనీ నవరాగినీ అన్నపాట ఎంతో శ్రావ్యంగా విన బడుతోంది. అందులో గుండెలు విచిత్రంగా కొట్టుకుంటున్నాయి. అనసూయకు మనస్సు, శరీరంకూడా అదుపు తప్పడం ప్రారంభించాయి. పాటలో ఏదో కొత్త అర్థాలు స్ఫురిస్తున్నాయి తనకు ఎప్పటికైన అటు వంటి ప్రేమికుడు దొరుకుతాడా? అది సినిమా!

నాయకురాలు ఎంత అన్నృష్టవంతురాలో అయినా లోకంలో జరిగేవే సినీమా తీస్తారంటారు? మరి ఈ సంఘటన ఎక్కడ జరిగిందో? అది తనకు సంభవించాలంటే తాను మరో జన్మ యెత్తవలసిందే. అప్పుడే తనజీవితంలో ముప్పదియైదు వత్సరాలు గడచిపోయాయి. జుట్టు నెరిసిపోతోంది. ముఖం వాడి పోతోంది అందుకే చటుక్కున గతం గుర్తుకొచ్చింది./

తనకు 14 ఏళ్ళు వచ్చేటప్పటికి ఎంతో అందగత్తె అనసూయ అనేవారు అందరూ! తాను మురిసిపోయేది దానికి తగినట్టు ఎంతో బాగా చదివేది క్లాసుకి మహారాణిలా వుండేది. తన వెంట చెలికత్తెల్లా ఎందరో అమ్మాయిలు ఎందరో కాలేజి అబ్బాయిలు వెంటబడేవారు. ప్రేమించ మన్నారు పెళ్ళి చేసుకొంటామన్నారు. కాని తన దృష్టి ప్రేమమీదలేదు. చదువుమీద వుంది. తాను బాగా చదువుకోవాలి. పెద్ద వుద్యోగం చెయ్యాలి. తల్లిదండ్రుల్ని ఆదుకోవాలి. అందుకే ప్రేమించామన్న వారిని, పెళ్ళిచేసుకొంటామన్న వారిని, పెళ్ళి చేస్తామన్న వారిని కూడా తిరస్కరించింది. చుట్టాలందరు తండ్రికి ఎంతగానో చెప్పారు. మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యమని!

పట్టుదలచే చదివిన అనసూయ పాతికేళ్ళు రాకుండానే వున్నవూళ్ళో హైదరాబాదులో లెక్చరర్‌గా స్థిరపడిపోయింది. పైగా తండ్రిది చాలీచాలని జీతం.

ఇల్లు గడవడమే కష్టం. పైగా ఆరుగురు సంతానం. అందరికి చదువులు, బట్టలు, తిండి, ఇంటి అద్దె యిలా రకరకాల ఖర్చులు. అనసూయకు తగిన చదువు చెప్పించాడు. ఉద్యోగం సంపాదించి పెట్టాడు. ఆమె సంపాదనకు అందుకుంది.

చన్నీళ్ళ వేన్నీళ్ళ సాయం అనుకున్నాడు. కాస్త అండ బాగానె దొరికింది ఆ సంసారానికి.

కాని అనసూయ మరింత జాగ్రత్తగా మసలుకోవలసి వచ్చింది. ప్రేమికుల గొడవ మరీ ఎక్కువైంది. మరింత అందం, హుందా తనం వచ్చాయి అనసూయలో. ఇంక రోడ్డు మీద వెంటబడే వారు, బస్సులో రాసుకు నుంచునే వారు, రిక్షా వెంటపడ్డే స్కూటర్లు, కార్లు, రకరాకాలుగా తట్టుకోవలసి వచ్చేది. అన్ని గండాలు దాటుతోనె వుంది. అసలు నిజం చెప్పాలంటే తన సుఖాల మాటే మరిచింది. తలొంచుకు పోవడమే తన వంతుగా భావించింది.

జీతం రాగానె ఇంటి కొచ్చి తండ్రిచేతిలో పెట్టేది. తనకు కావలసిన బస్సు కు మాత్రమే తీసుకునేది. మిగిలిన ఖర్చులే లేవు. సింపులుగా కాటన్ చీర, అదేనా ఇంట్లో వుతికి గంజిపెట్టి ఇస్త్రీ చేసుకొనేది. బిగువు జడ మొఖనికికా స్త పౌడరురాసుకొని కుంకుమ బొట్టు పెట్టుకొనేది. కాలికి సాధారణ చెప్పులు, అయినా అందరిలో కొట్టొచ్చినట్టు కనబడేది అనసూయ.

ఇంతలో చిన్న గవర్నమెంటు వుద్యోగం చేస్తున్న తండ్రి కాస్త రిటైరు అయ్యాడు. రిటైరు అయ్యాక వచ్చిన డబ్బుతో చిన్న యిల్లు కొనుక్కున్నారు సీతాఫల్ మండీలో. కొత్తలో అనసూయకు పెళ్ళి ప్రయత్నాలు చేశాడు. వాళ్ళ అడిగే కట్నాలు యిచ్చుకో లేక ఆ ప్రయత్నమే మానేశాడు. క్రమంగా అనసూయ పెళ్ళి విషయమే మరిచి పోయాడు ఆయన. ప్రేమించి

పెళ్ళి చేసుకునే శక్తి అనసూయలోను లేక పోయింది. తల్లి తండ్రి, సంసారం వీటికి ఆమె ప్రాధాన్యమిచ్చింది. రోజులు గడిచి పోతున్నాయి .

అనసూయకు ముగ్గురు చెల్లిళ్ళు. ఇద్దరు తముళ్ళు. పెద్ద చెల్లెలు ఇంటర్ చదువుతూనే యెవరినో ప్రేమించి ఇంట్లోంచి వెళ్ళిపోయింది. రెండవ చెల్లెలు బి. ఎ పాసై స్కూలు టీచరుగా చేరికూడా పనిచేస్తున్న టీచర్ని ప్రేమించి పెళ్ళి చేసుకొని వేరుగా కాపరం పెట్టేసింది. మూడవ చెల్లెలు పదవ తరుగతి వరకు చదువు కుంది. మేనరికం ఉందని వాళ్ళు తొందర పడితే శాస్త్రోక్తంగా పెళ్ళి చేసెశారు.

పెద్ద తమ్ముడు బి.ఎ. పాసై బ్యాంకులో వుద్యోగం సంపాదించాడు. మరో బ్యాంకులో పనిచేసే పిల్లతో పెళ్ళి చేసుకుని వేరు కాపరం పెట్టాడు. ఇక చిన్న తమ్ముడు ఇంటర్ చదువుతున్నాడు. ఇప్పుడాయింట్లో తన గొడవ ఎవరికీ పట్టదు. తన జీతం ఫస్టు తారీఖు రాగానె వస్తోందా లేదా అన్నదే వారికి కావాలి. ఇలా ఆమె జీవతంలో 15 సంవత్సరాలు ఉద్యోగినిగా కాలం గడించింది. నలభయ్యో పడి వచ్చింది. తను పెళ్ళి చేసుకోదని వారి తలంపు. తనకు పెళ్ళి అక్కర లేదని వారి నమ్మకం.

ఆ రోజు ఉదయమే అందరూ బెజవాడ పెళ్ళికని వెళ్ళారు. తనకు లోపల వెళ్ళాలనే వుంది. కాని కాలేజికి శలవుల్లేవు. పైగా తల్లికాని, తండ్రికాని ''వస్తావా అమ్మా'' అని అడగలేదు. అక్కడందరిలో పిల్లకు పెళ్ళి కాదంటే నామోషీ కాబోలు తను చేసిన త్యాగం ఆ విధంగా పరిణమించినందును ఆమె పరిపరి

విధాల బాధపడింది. కాసేపు గట్టిగా యేడ్వాలని వుంది. కాని ఓదార్చే వారెవ్వరూ లేరని ఆమెకు తెలుసు. అసలటు వంటి యేడుపులే ఆమెకు అలవాటు లేదు. ఇష్టం లేదు కూడా. తను ఒంటరిదై పోయింది. తనకెవ్వరు లేరు. తను అందరికి వుంది. ఆ చెల్లిని పిలిచి బట్టలు పెట్టాలి. ఈ చెల్లిని పిలిచి సూడిద లివ్వాలి. ఇదే తన బ్రతుకు. అందరి బ్రతుకులకు తనొక పని ముట్టు. ఆలోచించిన కొద్దీ ఆమె మనస్సు వికలమై పోయింది.

అంతలోనె మళ్ళీ ప్రస్తుతంలోకి వచ్చింది. సన్నజాజుల వాసన గుప్పుమంది. చల్లగాలి సేద తీరుస్తోంది. రేడియోలో "శివరంజనీ" పాట అయిపోయినట్టుంది శంకరాభరణంలోని పాట "సామజవరగమనా" అంటూ వినబడుతోంది. కళ్ళ యెదుట ఆ సినీమాలోని పెళ్ళి చూపుల దృశ్యం నిలచి పోయింది. తన కసలు పెళ్ళి చూపులే కాలేదు. తనకు ఆ సరదాయే తీరలేదు. పెళ్ళి పీటల మీద తలొంచుకుని కూర్చుంటే పెళ్ళి కొడుకు వాలు చూపులతో తనకు తాళికట్టే అదృష్టం ఈ జీవితానికి పట్టదు కాబోలు అనుకుంది. ఇన్నాళ్ల తనకు ఎప్పుడు అలా అనిపించ లేదు. అసలు పేరంటానికి వెళ్ళాలంటేనె అనసూయకు చికాకు. పెళ్ళి చూపులంటే చిన్నచూపు. పెళ్ళంటేనే కోపం కాని వయసు ముదిరిన తనకు ఈ జీవితంలో యింక లభించవు అనుకునేటప్పటికి తనకు చెప్పలేని మోజుపుడుతోంది. కోరిక కలుగుతోంది. ఏదో తీయని తపన. ప్రియుని చేతిలో తాను నలిగి పోవాలి. ఒడిలో వాలి పోవాలి. వాని ఎదలో హత్తుకు పోవాలి. ఎవరితో చెప్పలేని కోరికలు. చాటుగా తీర్చుకునే వారెందరో వున్నారు. తనకు అలాంటి వంటేనే తగని ద్వేషం, అసహ్యం కూడా!

పైగా ఈ వయస్సులో పెళ్ళి చేసుకుందా మంటే రెండో పెళ్ళివాడు తప్ప ఎవ్వరు ముందుకు రారు. కొందరు భార్యలున్నా వారే పెళ్ళి చేసుకుంటామని ముందు కొస్తున్నారు. ఆ ఎంగిలి పడిన మనుష్యులంటే తనకు గిట్టదు. సముద్రపు కెరటాలలా యెగిసి పడే తన అకాల కోరికలు ఎలా తీరుతాయో ఆమెకీ అర్థం కాలేదు. అసలారోజు తను ఎందుకలాఆలోచిస్తోందో ఆమెకీ అంతు పట్టలేదు.

మనస్సు మళ్ళా గతంలోకి జారి మోహన్ మీద నిలిచి పోయింది. ఆ రోజుల్లో తన దగ్గర ట్యూషన్ చెప్పుకొనె వాడు మోహన్. తన పెద్ద తమ్ముడితో పాటు చదువుకునేవాడు. మొదట్లో తలొంచుకొని ఎంతో శ్రద్ధగా చదువుకు పోయే వాడు. రాను రాను తనతో కబుర్లు ప్రారంభించేవాడు. కాస్త చనువు వచ్చాకా నవ్వుతూ మాట్లాడే వాడు. భయం తగ్గింది. ట్యూషన్ చెప్పేటప్పుడు క్రమంగా తన చూపుల్తో చూపులు కలపడం ప్రారంభించాడు. మోహన్ అలా చూస్తూంటే తను పాఠం చెప్ప లేక పోయేది. అతని చూపుల్లో ఏదో అయస్కాంతపు శక్తి ఆ చిరునవ్వులో ఏదో మత్తుమందు, పక్కకు చూస్తు పాఠం చెప్పేది. ''మెడమ్ ఇటు తిరిగి చెప్పండి'' అనే వాడు కొంటేగా! ఆమె నరాలు జివ్వుమనేవి. పాఠం చెప్ప నిచ్చేవి కావు. పుస్తకం మూసి లోపలికెళ్ళి పోయేది. అతను కూడా నవ్వు కుంటూలేచి వెళ్ళిపోయెవాడు. తను చదువుకుంటూటే వచ్చి యెదురుగా కూర్చునేవాడు. తను మాత్రం అతనితో చనువుగా మాట్లాడ లేక పోయెది. అతను కూడా కబుర్లు తగ్గించి తనకేసే చూస్తుండే వాడు. ఒక్క నిమిషం ఇల్లు వదిలేవాడు కాదు. తన కంటె చిన్నావాడు, పైగా తక్కువ కులం వాడు. ఇంటికి

ఎన్నో సరకులు పట్టుకొచ్చి యిచ్చేవాడు ట్యూషన్ పేరుతో ఎంతో డబ్బు ముట్టచెప్పే వాడు. అందుకే తల్లిదండ్రులు అతన్ని నెత్తి మీద పెట్టు కునే వారు.

సినీమాలకు రమ్మని బలవంతం చేసేవాడు. తను తమ్ముడు అతనితో సినీమాలకు, హోటళ్ళకు, పార్టీలకు, పిక్నిక్ లకు, వెళ్ళే వారు. ఎంతో సరదాగా గడిచి పోయేవి రోజులు. బి. యస్‌సి. పాసైన మోహన్ ఇంజనీర్‌లో చేరాడు. అయినా రోజు వచ్చి తన యెదురుగా తనని చూస్తూ కూర్చునే వాడు. ఆ పరిణామమేల వుంటుందోనని తను చాలా భయపడింది. ఇంజనీరింగు పూర్తి అయింది మోహన్‌కు. బొంబాయిలో ఉద్యోగమొచ్చింది. వెళ్ళేరోజు వచ్చి ఖరీదైన చీర జాకెట్టు ఆర్టీఫిషియల్ ముత్యాల సెట్టు పట్టుకొచ్చి చేతిలో పెట్టాడు. సెట్టు పెట్టుకోమని బ్రతిమాలాడు. కాని పెట్టుకోలేదు తను. అదే ఆరాధన. అవే చూపులు. అదే చిరునవ్వు. ఎన్నో మాట్లాడాడు. ఎంతో నవ్వించాడు. వెళ్ళే సమయంలో చటుక్కున అతని ముఖం వాడిపోయింది. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. నోట మాటరాలేదు. ఏమి చెబుతాడోనని భయపడ్డ తనతో "వస్తా మేడమ్" అంటూ కన్నీళ్ళు తన కంటపడకుండా వెళ్ళిపోయాడు. ఆరు నెలలైంది. ఉత్తరంకూడా లేదు. ఒక్కసారి అతను కనబడితే ఎంత బాగుండునో అనుకుంది అనసూయ.

అప్పటికే రాత్రి ఎనిమిది గంటలయింది. గంటనుంచి అలా కూర్చుని ఆలోచిస్తోందన్నమాట. ఇంకా భోజనం చెయ్యలేదు. అసలు భోజనం చెయ్యాలనేలేదు. హాయిగా యే సినీమాకైనా వెడితే ఎంత బాగుండునో. తను ఒంటరిగా వెళ్ళడమెట్లా.

ఆమె ఆలోచనలు అలా సాగిపోతున్నాయి. అంతలో... "మె ఐ కమ్ ఇన్" అంటూ తలుపులు తోసుకుని మోహన్ లోపలి కొచ్చాడు. పరిచితమైన ఆపిలుపు, సుపరిచితమైన ఆమనిషి ఒకే సారి వినబడి, కనబడటంతో అనసూయ చలనంలేకుండా అలాగె కూర్చుండిపోయింది. "మేడమ్ బాగున్నారా" అంటూ పలుకులేని ఆమెమీదికి వంగాడు. తెల్లబోయిన అనసూయ అతనికేసిచూసింది మరీ వాడిగావున్న ఆచూపుల్ని తట్టుకోలేక తలదించుకుంది. అతన్ని కూర్చోమనికూడా చెప్పలేకపోయింది. ఆమె హృదయాన్ని ఎప్పుడో తెలుసుకున్నాడు మోహన్. అతనే చనువుగా పక్క నున్న కుర్చీ తెచ్చుకొని ఆమెకు దగ్గరగా వేసుకుని కూర్చున్నాడు. ఆమె ఏమీ ప్రశ్నించదని తెలుసు అందుకే అతనే

"బొంబాయినుండి పొద్దుట మావూరు వచ్చాను. అక్కడ నుంచి ఇప్పుడే బస్సులో వచ్చాను" అన్నాడు ఆప్యాయంగా.

తలెత్తిచూసి ఆ ఆప్యాయతను అందుపుచ్చుకుంది కాని సమాధానం చెప్పలేకపోయింది.

"ఇంట్లో ఎవ్వరూలేరా" అన్నాడు అతనే.

తల అడ్డంగా తిప్పింది లేదన్నట్లు.

"ఎక్కడికెళ్ళారు" అనడిగాడు.

ఈసారి సమాధానం చెప్పక తప్పదు.

"పొద్దుటే పెళ్ళికెళ్ళారు" అంది మెల్లిగా తడబాటును కప్పి పుచ్చుకుంటూ.

"అలా వున్నారేం. ఒంట్లో బాగాలేదా" అన్నాడు మృదువుగా.

"బాగానే వున్నా" అంది తల పక్కకు తిప్పి

"భోజనం చేశారా" అనడిగాడు ఎంతో ప్రేమగా.

"లేదు" అంది ముక్తసరిగా.

"సినీమాకి వెళదాం. త్వరగా భోజనం చెయ్యండి" అన్నాడు.

ఆమె కదల్లేదు.

"హోటల్లో భోజనం చేద్దాం. పోనీ బట్టలు మార్చుకోండి" అన్నాడు వాచీ చూసుకుంటూ.

అయినా కదల్లేదు. అతను కుర్చీలోంచి లేచి "లేవతియ్యమంటారా" అన్నాడు నవ్వుతూ కుడిచెయ్యి ముందుకు చాచి. వెంటనేలేచి లోపలకి పరుగెత్తింది అనసూయ. ఆమె బుగ్గలు కెంపులవ్వడం అతను గ్రహించాడు.

సబ్బుతో తెల్లగా మొహం రుద్దుకుంది. స్నోరాసి పౌడరు అద్దుకుంది. కంటి కొసలవరకు కాటుక తీర్చిదిద్దింది. గుండ్రంగా ఎర్రని కుంకుమబొట్టు పెట్టుకుంది. ఎందుకో ప్రత్యేకంగా ముస్తాబవ్వాలనిపించింది. బొంబాయి వెళ్ళేరోజున మోహన్ కొనిచ్చిన గులాబీరంగు అమెరికన్ జార్జెట్ చెమికి పువ్వుల చీర కట్టింది. మాచింగ్ జాకెట్టు వేసింది. అతను ఇచ్చిన ముత్యాలసెట్టు పెట్టుకుంది. ఆర్టిఫిషియల్‌దే. అయినా ఆమెకు ఎంతో అందాన్నిచ్చాయి. మరోసారి అద్దం చూసుకుంది. ప్రొద్దుట పెట్టుకోవచ్చని కట్టివుంచిన జాజిపూలమాల తల్లో పెట్టుకొంది. ఆరోజు మోహన్ బతిమాలినా చీర కట్టుకోలేదు. ఆసెట్టు పెట్టుకోలేదని జ్ఞాపకమొచ్చేటప్పటికి అనసూయకు నవ్వు వచ్చింది. పైగా వాటిలో

అతను ఎదురుపడటానికి కాస్త సిగ్గనిపించింది. ఇంతలో మోహన్ "మేడమ్ తెమలాలి టైమవుతోంది" అంటూనె గది గుమ్మంవద్దకు వచ్చాడు. ఎదురుగా వస్తున్న అనసూయను చూసి చూపులు తప్పించుకోలేకపోయాడు. అతని కళ్ళు వింతగా మెరిశాయి. మునుపటికంటె పదిరెట్లు చిన్నగా పదిరెట్లు అందంగా కనపడింది అతని కంటికి. తనివితీరా చూసుకున్నాడు. ఇబ్బందిగా నిలబడింది అనసూయ.

"రండి మేడమ్" అంటూ వెనక్కి తిరిగి వీధి తలుపులు తీసి బయటకు వచ్చాడు. తలుపులు తాళాలువేసి అతనివెంట నడిచింది ఆమె. వీధిచివరనున్న ఆటోపిలిచి యెక్కి హోటలుముందు ఆపించాడు. ఒంటరిగా ఇదివరకెప్పుడు రాలేదు. ఎప్పుడూ తమ్ముడు వెంట వుండేవాడు, ఈనాడు తను ఒంటరిగా అతనితో వెడుతోంది. ఆమె కిష్టమైన వంటలు అతనికి తెలుసు అందుకే కావాలని దగ్గరుండి తినిపించాడు. ఎక్కడ నోట్లో పెడతాడోనని భయపడి తినమన్నదల్లా తినింది. అలా పక్కన కూర్చుని తింటుంటే వింత ఆనందం, చెప్పలేని సంతృప్తి ఆమెకు కలిగాయి.

భోజనాలై సినిమాకు బయలుదేరారు. హాలు దగ్గరగానె వుంది. ఆమెను రాసుకొనే నడుస్తున్నాడు మోహన్. బాల్కనీ టికెట్లుకొని హాలులోకి తీసుకెళ్ళాడు. ఒకళ్ళకు తగిలేటట్టు ఒకళ్ళు కూర్చున్నారు. ఆ వింతస్పర్శకు శరీరంలో ఏదో వింత అలజడి ఆరాటం బయలుదేరాయి. ఇంతలో సినిమా ప్రారంభమైంది. గాలికి ఎగురుతున్న జుట్టును రెండుచేతులతో సవరించుకొంటోంది. పమిటకొంగు జారి మోహన్ ముఖాన్ని కప్పింది. ఎంతో ఆప్యాయంగా తీసి ఆమె పమిటను యధాస్థానంలో అతనే సర్దాడు.

కోరిక అణచిపెట్టుకోలేక ఆమె చేతిని అందుకున్నాడు. ఎన్నాళ్ళ నుంచో ఎదురు చూస్తున్నట్లుగా రెండుచేతులు బిగుసుకుపోయాయి ఒకరిచూపుల్లో మరిఒకరి చూపులు మాటిమాటికి కలుసుకుంటు న్నాయి. అసలు సినీమాధ్యాసేలేదు వారికి. ఆపరిసరాలనే మరచి పోయారు.

ఇంట్రవెల్ ఎప్పుడయిందో వారికే తెలియదు. లైట్లు వెయ్య గానె చటుక్కున చేతులు వదిలేశాడు, ఇంకాదగ్గరగా రావాలన్న తపన వారిలో హెచ్చింది. ఇంక ఇద్దరూ కూర్చోలేకపోయారు.

"వెళ్ళిపోదామా" అన్నాడు మెల్లిగా ఆమె చెవిలో. తలూ పింది ఆమె, లేచి నిలబడ్డాడు అతను. అతని వెనకాలేచింది ఆమె. ఇద్దరు బయటకొచ్చేశారు. ఈసారి కావాలనే రిక్షా మాట్లా డాడు, ముందుగా "మేడమ్ ఎక్కండి" అన్నాడు ఆమె ఎక్కి కూర్చుంది. తానుకూడా ఎక్కి ఆమె పక్కనే కూర్చున్నాడు. ఇద్దరి శరీరాలలో ఏదో కంపన, ఏదో తపన. ఆమె నడుంచుట్టూ చెయ్యివేసి ఎక్కడ దూరమవుతుందో అన్నంతదగ్గరగా పట్టుకు న్నాడు మోహన్. ఆమె అడ్డు చెప్పలేదు. పైగా మరింత దగ్గరగా జరిగి కూర్చుంది యింకతనదే అన్నట్లుగా.

ఇల్లు వచ్చింది. రిక్షాకు పైసలిచ్చి తాను ముందు దిగి చెయ్యి అందించి ఆమెనుదింపాడు. చేతిలోని తాళాలు తీసుకుని తానే తాళంతీసి తలుపులు తెరిశాడు. ఆమె భారాన్ని సగం అతను అందిపుచ్చుకున్నాడనుకోగానే ఆమెకు చెప్పలేని సంతృప్తి కలిగింది. ఆమె మెల్లిగా ఇంట్లోకి అడుగుపెట్టించి తలుపులు మూసి గడియలేశాడు.

ఆమెబట్టలు మార్చుకుందామని పడకగదిలో అడుగు

పెట్టింది. ఆమె వెనకాలే లోపలికెళ్ళి నిలబడ్డాడు మోహన్. చటుక్కున వెను తిరిగింది. ఆమె యెదురుగా అతను, అతను యెదురుగా ఆమె. చేతులుచాపి ఒక్కడుగు ముందుకువేశాడు మోహన్. అందుకెదురుచూస్తున్నట్లుగా అనసూయ అతనిచేతుల్లో వాలిపోయింది. బలమైన ఆబాహువులు ఆమెను చుట్టుముట్టాయి. కరువుతీరా కౌగిట్లో నలిపివేశాడు. ఆమె చిరకాల కోరిక తీరింది. ఇద్దరు యేదోలోకాల్లో తేలిపోయారు. ఎన్నడూ అనుభవించని సుఖాన్ని, ఆనందాన్ని పొందారు. అందిన భాగాలన్నీ పెదాలతో అందుకున్నాడు. ముందెన్నడు దొరకని అనుభవమది. ముందెన్నడు పొందని సుఖమది. అదే ప్రేమకు ఫలితం. అదే ప్రేమికులకు స్వర్గం.

మెల్లిగా మంచం దగ్గరకు నడిపించుకొచ్చాడు ఆమెను అందిమీద కూర్చోపెట్టి తాను పక్కనే కూర్చున్నాడు. ఎక్కడ విడిపోతామో అన్నంతగట్టిగా రెండు చేతులతో పొదివి పట్టుకున్నాడు.

"మేడమ్ మీరు నాతో బయలుదేరాలి"

"ఎక్కడి కి"

"నాతో బొంబాయికి"

"ఎందుకు"

"మిమ్మల్ని వదిలి వుండలేను,"

"అదెట్లా కుదురుతుంది."

"ఇద్దరం పెళ్ళిచేసుకుందాం"

"ఎవ్వరూ అంగీకరించరు"

"ఇలామనిద్దరం కలవడానికి ఏవరైనా అంగీకరించారా! ఎవరినేనా అడిగే ఇలాకలుసుకున్నామా? అదికూడా అంతే, మనిద్దరి స్వవిషయం అది. ఎన్నాళ్ళో ఆలోచించి యీ నిర్ణయానికొచ్చాను. మావాళ్ళు మీవాళ్ళు అంగీకరించరని నాకు తెలుసు. వాళ్ళ అంగీకారంతో మనకు పనిలేదు"

"వీళ్ళు మనని బ్రతకనిస్తారా?"

"బ్రతక నివ్వక పోవడానికి వాళ్ళెవరు. బొంబాయి వెళ్ళి ఇద్దరం వెంటనే పెళ్లి చేసుకుందాం. మీవాళ్లకి మావాళ్లకి అవసరమైతే డబ్బుపంపుదాం. అవసరమైతే మీరుకూడా అక్కడ ఉద్యోగం చెయ్యవచ్చు. వీళ్లమధ్య మిమ్మల్ని ఒంటరిగా వదలి నే వెళ్లను. మిమ్మల్ని తీసుకునే వెడతాను."

అతని నిర్ణయానికి ముగ్ధురాలైన అనసూయ ఆనందం పట్టలేక ఒక్కసారి అతనిగాఢంగా పెనవేసుకుని కరువుతీరా పెదాలు చుంబించింది.

"మేడమ్‌గారు వస్తునట్టేన" అన్నాడు సంతోషంపట్టలేక మత్తుగా.

ఒక్కసారి తల్లి, తండ్రీ, తమ్ముడు బాధ్యతలు, ఉద్యోగం అన్నీ అనసూయ కళ్లముందు మెదిలాయి. ఎక్కడా ఆమె మనస్సు ఆగలేదు. ఏ మార్పులేకుండా సాగె ఆ జీవితం విసుగెత్తింది. మార్పుకోరుకుంది కోరుకున్నవ్యక్తి ఎదురుగా నిలబడ్డాడు. కావాలనుకున్న సుఖాన్ని చేతులెత్తిపిలిచి అందిస్తున్నాడు. అతని సన్నిధిలో చెప్పలేని సుఖం. సంతృప్తి, ఇప్పుడింక

మోహన్ లేకుండా తాను బ్రతుకలేను. ఒక నిశ్చయానికొచ్చి నట్లుగా అతని కళ్ళల్లోకి సూటిగాచూస్తూ.

''మోహన్ నీయిష్టం'' అంది.

అంతే అతని సంతోషానికి అవధులులేవు, అతని కోరిక లకు పగ్గాలులేవు. ''మేడమ్'' అంటూ ఆమెను చేతులతో ఎత్తి గిరిగిరా తిప్పేడు. ''ప్రొద్దున్నే మన ప్రయాణం'' అన్నాడు ప్రేమశంఖాన్ని పూరిస్తున్నట్టుగా

రెండు పాయల్లా సాగుతున్న ఆ జీవిత ప్రవాహాలు ఒక్క-సారి కలిశాయి. అందుకే ఆ కలయికలో అంత సంఘర్షణ, అంత మెరుపు, ఆ మెరుపులో కొండంత తృప్తి. ఆ తృప్తిలో చెప్పలేని ఆనందం-సుఖం ఒక్క-క్షణంలో ఇద్దరి జీవితాలు పెనవేసు కున్నాయి. వారి గమ్యాలే మారిపోయాయి. ఒకరిఒడిలోఒకరు తనివితీరా నిద్రపోయారు.

ఎక్కడనుంచో సుప్రభాతం వినబడుతోంది. ఉలిక్కి-పడిలేచింది అనసూయ. ఇంకా వెలుగురాలేదు. గబగబాలేచి తను పట్టుకెళ్లవలసిన సామానంతా సర్దుకుంది. తను చేస్తున్న పనిని హర్షించి ఆశీర్వదించవలసిందిగా కాగితంమీదరాసి టేబులు మీద పెట్టి ఎగిరిపోకుండా పెన్నువొత్తుపెట్టింది. మంచం సమీ పించి ''మోహన్'' అనిపిలిచింది. ఆమె చేస్తున్న పనంతా గమ నిస్తున్న మోహన్ ఒళ్లువిరుచుకుంటూ లేచి ఆమె ముఖాన్నే చూశాడు. ఎంతో వుత్సాహంగా సన్నగా ఈల వేసుకుంటూ బాతు రూమువైపు నడిచాడు.

అతను తిరిగిరాగానే కాఫీకప్పు చేతికందించిందిఅనసూయ. కప్పు అందుకుని ఆమె ముఖంలోకి అలాగె చూస్తూ ఉండి

పోయాడు. మేడమ్ తనకు భార్య కాబోతోంది. అలా అనుకోగానె ఏదో భయమనిపించింది. ఆమెకు తగిన గౌరవాన్ని, అభిమానాన్ని ప్రేమని పంచియిచ్చేశక్తి తనలో వున్నాయో లేవో. అలా సాగి పోతున్నాయి అతని ఆలోచనలు. "కాఫీ చల్లారిపోతోంది మోహన్" అంది అనసూయ చనువుగా దగ్గరకొచ్చి నిలబడి. కాఫీ ఒక్క గుక్కలోతాగేసి పక్కనే పెట్టాడు కప్పు. ఆమెకేసి చూసి "కాఫీ చాలా బాగుంది" అన్నాడు ఆమెచేతిని అందుకుని. ఆమె చిరునవ్వు జల్లు కురిపించింది. అతని ఒళ్లు పులకరించింది. అంతకంటె తియ్యగా అంటూ ఆమె అందించకుండావున్న పెదాలు చటుక్కున అందుకున్నాడు. ఏనాడు ఎరుగని అమృతాన్ని తనివితీరా అందుకుని తాగాడు. మెల్లిగా ఆమెను వదిలి "త్వరగా బయలుదేరాలి. వెలుగు రాకముందే వెళ్ళిపోవాలి" అన్నాడు.

"నేను రెడీ" అంది ఆమె.

"మీనాన్నగారికెలా చెప్పడం" అన్నాడు సందేహంగా.

డ్రాయరుమీదున్న కాగితం తీసి చూపించింది. చదువుకుని నవ్వుకున్నాడు. తిరిగి అక్కడే పెట్టేసాడు.

ఆమె సర్దుకున్న పెట్టె చేతపట్టి వీధి తలుపులు తెరిచాడు. మెల్లిగా అడుగు ముందుకు వేశాడు. అతని అడుగులోఅడుగువేసి ముందుకెళ్ళింది. తలుపువేసి తిరిగి తాళం పెట్టింది. తాళాలు తీసుకుని వీధిలో పాలపాకెట్టు అందుకుంటున్న పక్కామె చేతిలో పెట్టింది. "మావాళ్ళువస్తే యిచ్చేయండి" అంటూ ఆమె ఏమి అడుగుతుందోనని గబగబావచ్చి ఎదురు చూస్తున్న మోహన్‌తో చేరుకుంది.

అప్పుడే తూర్పు వాకిట వెలుగురేఖలు విచ్చుకుంటున్నాయి అతని అడుగులో అడుగు వేస్తూ నడుస్తోంది అనసూయ. ఒకచేత్తో పెట్టిని మరోచేత్తో అనసూయ చేతిని పట్టుకున్నాడు మోహన్. ఆ ప్రేమికులిద్దరు ఆ వెలుగురేఖలవైపు నడిచారు.

ఆ జంట అనుబంధం ఎవరికీ తెలియదు. వారి ఆత్మీయత అర్థంకాదు. ప్రేమించుకోని దంపతులు సృష్టిలో ఎవరూ వుండరు? ఆసుఖాన్ని అనుభవించే దంపతులు మరీ అరుదు. వారి ప్రేమకు ఫలమే జీవులసృష్టి. ఆంతర్యం తెలియక ఎప్పటికప్పుడు జనం అలా విడ్డూరంగా చెప్పుకుంటూనే వుంటారు. ఎప్పటికప్పుడు కొత్త ఆకొత్తలో ఏదోమోజు. ఆమోజులో ఏదో సంతృప్తి.

"విన్నావా? అనసూయ లేచిపోతోంది!"

"అరుగోవారే? ఆ వెళ్ళేది వారే?

"నాలుగేళ్ళు చిన్నవాడేనే అమ్మా!"

"ఇదేం విడ్డూరమే తల్లీ"

"కులం తక్కువవాడే అమ్మా"

"అయ్యో! అయ్యో! అయ్యో! నలభయ్యో పడిలో ఇదేంబుద్దే అమ్మా!"

కలికాలమే తల్లీ!"

"అయినా ఇదంతా దానిఖర్మే! ఎవరుచేసినఖర్మ వారనుభవించాలి"

ఇలా సాగిపోతున్నాయి విమర్శలు.

నిజమైన ప్రేమకివేమీ అడ్డు రావు. ప్రేమకు వయస్సు భేదం తెలీదు. ప్రేమకు నలుపు తెలుపు తేడాలు లేవు. ప్రేమకు కులం మతం ప్రసక్తిలేదు. ఉవ్వెత్తున ఎగసిపడే సముద్రతరంగాల వలె ప్రేమ ఎప్పటికప్పుడు పొంగి పారుతూనె వుంటుంది. అది ఒక జీవనస్రవంతి. ఆస్రవంతి ప్రేమికులను ముంచెత్తుతూనె వుంటుంది. అనంతసుఖాన్ని చవిచూపిస్తూనె వుంటుంది.

ఆ కొత్త ప్రేమికులు ముందుకు సాగిపోతున్నారు. ఆ పుత్తరం చూసుకున్న తల్లిదండ్రులు మొత్తుకుంటారు. ఏడుస్తారు. కక్ష కడతారు. గుమ్మం ఎక్కొద్దంటారు. కాని యివేవి వినబడనంత దూరం ఆ ప్రేమికులప్పుడే వెళ్ళిపోయారు. అనసూయ లేచిపోయిందన్నమాట వారికిక వినబడదు.

(ఆదివారం వీక్లీ)

కథా నిలయం
1521
శ్రీకాకుళం